ముగింపు

విజయ.మారుతి

'తలా! ఓ తలా!' అంటూ బూట్లు టక టక శబ్దంచేస్తూ హాల్లోకి అడుగు పెట్టాడు రవి.

సావిట్లో సోఫాలో కూర్చుని ఏదో నవల చదువుతున్న లత మాట్లాడలేదు.

ఒకసారి లత వంక చూసి 'వూ'అంటూ దీర్ఘంతీస్తూ ఆమెకు ఎదురుగా వున్న సోఫాలో కూర్చొని బూట్లు విప్పసాగాడు.

'అది సరే నేను వెళ్ళేప్పుడు బాగానే వున్నావు. వచ్చేసరికి ఈ చెముడేమిటి?' అంటూ ఆశ్చర్యంగా నోరు తెరిచాడు.

వచ్చిన నవ్వును పెదిమలమీదకు రానీ కండా, కనుబొమలు అందంగా ముడి వేస్తూ 'ఇక్కడ ఎవరికీ చెముడు లేదు కానీండి, ప్రొద్దున నీవు వెళ్ళేప్పుడు బాగానే వున్నావు, వచ్చేప్పుడు 'మతిమరుపు' వెంటబెట్టుకొచ్చావా?' అంది వెక్కిరుస్తూ.

'నాకు మతిమరుపుంటే, నీకు పిచ్చెక్కిందన్నమాటే!'

'నాకు చెముడుంటే నీకూ అదే!' అంది పుస్తకం చాటునుంచి.

'ఏయ్! అమ్మాయ్! ఏమిటా పొగరు?' అంటూ సోఫాలోంచి లేచి లత చేతిలోని పుస్తకం లాగి అవతల పారేశాడు.

'ఏయ్ అబ్బాయ్! ఏమిటీ!' అంటూ అతనివంక చూసి కళ్ళు పెద్దవిచేసి తనను పట్టుకోజూసిన రవీంద్రను చూసి ఒక్కసారి గుమ్మం దగ్గరకి పరుగెత్తి చిలిపిగా నవ్వుతూ 'ఏమిటీ పొగరు?' అంటూ లోపలికి పరుగుదీసింది. లత పొడుగాటి జడ అందంగా వూగులాడింది. ఆమె వంక అలాగే చూస్తూ నిల్చున్న రవి మళ్ళీ సోఫాలో చతికిలబడి రెండు కాళ్ళు ఎదురు వేసి టేబిల్ మీద పేపరు చేతిలోకి తీసికొన్నాడు.

'బావా! కాఫీ!' అన్న పిలుపుకి పేపరు అవతల పారేసి లత వేపు తిరిగాడు.

ఆరోజు శుక్రవారం కాబోలు తలంటి పోసుకొన్న జుట్టు ముఖంమీద పడుతోంది. కళ్ళనిండా కాటుకే. నుదుట ఎర్రని బొట్టుతో చాలా అందంగా కన్పించింది లత. అల్లాగే ఆమెవంక చూస్తూ కప్పు నోటిదగ్గర పెట్టుకొని 'థూ' అంటూ ఒక్కసారి వుమ్మేసి ఒక్క ఎగురు ఎగిరి ఆ కప్పును టేబిల్‌మీద పడేసి—

'అబ్బ! పచ్చికారం! అమ్మ చంపేశేవే!' అంటూ అటూ ఇటూ తిరగడం మొదలుపెట్టాడు నెత్తి నోరు కొట్టుకొంటూ.

అతన్నిచూసి పకపక నవ్వి 'అయ్యిందా పెళ్ళి? నాకు చెముడా?' అంది.

'అమ్మా సుబ్బమ్మా! ముందుకాసిని మంచినీళ్ళు తే. తరువాత పళ్ళయికి లిద్దువుగాని' అన్నాడు వుక్రోషం పట్టలేక.

'నేను సుబ్బమ్మనా' అంది.

'మవ్వు సుబ్బమ్మకాదూ. లతవి...వును

అతనే' అంటూ ముక్కు చీదాడు.

రడీగా వుంచుకున్న పంచదార, చెంబుడు నీళ్ళు తీసికొచ్చి అతని నోట్లో పంచదారపోసి చెంబు అతనిచేతి కిచ్చింది. ఆ నీళ్ళు గటగట త్రాగి 'హమ్మయ్య చంపేశావుగదే అంటూ గొంతు నిమురుకో సాగాడు లత అతనిచేతిలోని చెంబుతీసికొని వెళ్ళబోయింది.

'కాఫీ' అన్నాడు నీరసంగా చేయిపట్టుకొని.

'తెస్తా వుండు' అంటూ అతని చేతిలోంచి తనచేయి తీసికొంది.

లత కాఫీతెచ్చి అతనికిచ్చింది. ఆమె వంక చూడకుండానే కాఫీ నోటిదగ్గర పెట్టుకోబోయి ఆగి 'లతా ఫిఫ్టీ! ఫిఫ్టీ! నువ్వుకూడా త్రాగు' అంటూ సాసర్లో పోసియిచ్చాడు.

'ఏం! మళ్ళా ఏమన్నా కలిపానని అనుమానమా! ఏది ఆ కాఫి యిటు ఇయ్యి' అంటూ రవిచేతిలోని కప్పును తీసికొని సోఫాలో స్థిమితంగా కూర్చుని తాగేస్తోంది.

ఆమెవంక అలాగే చూస్తూ కూర్చున్నాడు రవి ఏమి చెయ్యలేక.

'బావా! నువ్వు పారేసిన పుస్తకం కాస్త యిస్తావా! పూర్తిచేయాలి' అంది తాపీగా.

రవికి వళ్ళు మండిపోయింది గబుక్కున లేచి ముఖంమీదపడ్డ జుట్టును వెనక్కి తీసికొన్నాడు. టేబిల్ దగ్గరున్న బూట్లను తొడుక్కొని బయటకి వెళ్ళబోతుంటే 'బావా! ఆగు కాఫితాగివెళ్ళు' అంటూ అతనిచేయి పట్టుకొని ఆపింది.

'నువ్విచ్చేదేమిటి? హాయిగా బయటికి వెళ్ళితే కావల్సినంత మంది ఇస్తారు' అంటూ ఆమెచేయి విదిల్చుకుంటూ వెళ్ళిపోయాడు.

లత అల్లాగే నిలబడింది. ఆమె కళ్ళలో నీళ్ళు తిరిగాయి. ఇంక ఆగలేమంటూ బుగ్గలమీదకు జారిపోయాయి. అయినా తనేంచేసింది తనే ఎప్పుడూ ఏడిపిస్తాడు. నేను ఈరోజునేగా 'ఇల్లాచేసింది. అయినా, ఈరోజిలా అనకండావుంటే బాగుండేది 'అక్కడ తాగుతాడోలేదో!' అంటూ తననితనే తిట్టుకుంది.

'లత! బావ వచ్చాడా?' అన్న తల్లి పిలుపుకి గబుక్కున కళ్ళు తుడుచుకొని.

'వచ్చి వెళ్ళాడమ్మా' అంది.

'అయితే ఒక యుద్ధకాండ ముగిసిందన్నమాట. రేవు పెళ్ళయితే చూడాలి' అందావిడ నవ్వుతూ.

'తను నన్ను అనవచ్చుగాని నేనంటే వస్తుంది కోపం పెద్ద' అంది కోపంగా.

'ఆ! ఏదో తమాషాకి అన్నాడనుకో! దీనికింత గొడవ ఎందుకు? నేను గుడికి వెళ్ళుతున్నా తలుపు వేసికో' అంటూ ఆవిడ చెంగు బుజం నిండుగా కప్పుకుంటూ వెళ్ళిపోయింది.

రవికోసం వాకిట్లో నుంచున్నది కాసేపటికి వీధిలోని లైట్లు ఒక్కసారి వెలిగాయి లత గబుక్కున దణ్ణం పెట్టుకొని దేవుడి పటం చూసింది. లోపలికి వెళ్ళి హాల్లో లైటువేసి వచ్చింది ఎక్కడా రవి జాడ లేదు. లత కంగారుపడిపోయింది. 'అనవసరంగా ఈ రోజు నా మూలంగా ఇల్లా అయ్యింది' అంటూ తన్ని తానే తిట్టుకొంది.

దూరంగా రవి ఆకారం కనబడేసరికి చల్లబడిపోయిన కోపం ఒక్కసారి తిరిగి ఆవిడలో ప్రవేశించి ముఖం అంతా ఎర్రబడసాగింది. అతనికోసం తను ఎదురు చూసినట్లు వుండకూడదని గబగబ గదిలోకి వచ్చి పక్కమీద వాలిపోయింది.

'లతా! లతా!' అంటూ అన్ని గదులు వెతికి లత దగ్గరకు వచ్చాడు.

'లతా' అంటూ మంచం దగ్గర వున్న కుర్చి దగ్గరకి జరిపి కూర్చున్నాడు.

లత మాట్లాడలేదు.

'లతా!' అంటూ ఆమె తల మీద చేయి వేశాడు.

ఆ చేతిని విసరికొట్టి లేచి కూర్చుంది. ఆమె ముఖం చూస్తూనే తెలుస్తోంది. ఏడ్చినట్లు ఇంకా బుగ్గలమీద తడి అలానే వుంది.

'లతా కాఫీ యివ్వు' అన్నాడు ఆమె వంక చూస్తూ.

'ఏ హోటలువాడో యిస్తాడుగా'

'కాని నీ చేతితో తాగినట్లు వుంటుందా?'

'మరి నువ్వు కాఫీ తాగలేదా?' అంది మంచం దిగుతూ. ఆమె ముఖంలోని ఎరుపు రంగు తరగిపోయింది.

...'ఊహు!' అంటూ తలూపి 'అసలు నేనలా తాగుతా అనుకున్నావో' అన్నాడు కళ్ళు చిట్లించి.

'అయితే ఒక్కనిమిషం వెయిట్‌చెయ్యి. తెస్తా' అంది.

ఈ 'లత' తనది అనుకుంటె రవి హృదయం చెప్పలేనంత గర్విస్తుంది. ఈ ఏడులో తన పరీక్షలై పోతాయి. అత్తయ్య ఈ పెళ్ళికోసం మరీ తొందర పడిపోతుంది. ఇంకెంత! రెండ్నెల్లు. ఆవిడను ఇంతవరకూ తనే ఆపాడు.

'బావగారూ! మీ ఆలోచనా సామ్రాజ్యంలోంచి క్రిందకిదిగి ఈ అమృతం సేవించండి' అంది అతనినోటికి కప్పు అందిస్తూ.

'లత! ఏం కాఫీయిది. కారమూ లేక...' అంటూ చిలిపిగానవ్వుతూ ఆమె వంక చూశాడు.

'ఏదీ!' అంటూ కప్పు తీసికోబోయింది.

'లత! అయితే అమృతమే అన్నమాట' అంటూ గబగబ తాగేశాడు.

రవి మేనత్తకూతురు లత. రవి తల్లి చనిపోతూ రవిని అతని ఆస్తిని సుభద్రమ్మగారి చేతుల్లో వుంచింది. అప్పటినుంచి సుభద్రమ్మగారు ఆ ఆస్తిని కాపాడుతూ రవిని లతని పెంచి పెద్దచేసింది. అప్పటికే లతతండ్రి పోయాడు. రవి 'ఎమ్మెస్సీ' చదువుతున్నాడు. ఈ ఏటితో ఆఖరు. వీళ్ళ పెళ్ళి చేసి తనబాధ్యత తీర్చుకొందామని ఆవిడ అభిప్రాయం. లతను 'ఎస్సెల్సి'లోనే ఆపేసింది.

రవి నాచదువు అయ్యేవరకు చదివింతమంటే 'వద్దులేరా అది కాస్త సాయంగా వుంటుంది అని లతని కాలేజీలో చేర్పించలా

ఆరోజుతో రవిపరీక్షలు అయిపోతాయి. అంచేత ఆ సాయంకాలం పిక్చరుప్రోగ్రాము వేసికొన్నారు

తను రెడీఅయి రవికోసం ఎదురు చూస్తూంది.

రవి వస్తూనే 'ఎక్కడికి ముస్తాబు అయి కూర్చున్నావు' అన్నాడు.

'పిక్చరికి వెళ్దామన్నావుగా! అంది.

'ఇది మరీబాగుంది! మా ఫ్రెండ్సులంతా వెళ్ళుతున్నారన్నాగాని నిన్ను తీసికెళ్తానన్నానా?'

'ఇదిగో మహానుభావా! నీతో ప్రయాణం అవడం అంత బుద్ధితక్కువ మరిలేదు. నీతో ఎవరూ ఇప్పుడు సినిమాకి రావటం లేదు' అంటూ లేవబోయింది.

'మరి సినిమాకి రానట్టేనా?'

'ఆట్టే' అని తల విదిలించింది. పొడుగాటి ఆమెజడ మెడచుట్టు ప్రదక్షిణం చేసింది.

'నిజంగానేనా' మళ్ళీ రెట్టించాడు.

'ఆ! నిజంగానే!'

'లతా ఇదిగో నీకోసం బజారంతా గాలించి ఎంతచక్కటి బహుమతి తెచ్చానో' అన్నాడు చేతులు వెనక్కిపెట్టి.

లత అప్పుడుచూసింది అతని చేతిలోని ప్యాకెట్.

'ఏమిటిబావా అది' అంది అతని దగ్గరగావస్తూ ప్యాకెట్ అందుకుంటూ.

'మరి నువ్వు నాతోరావాలి'

'వస్తా ముందు అదేమిటోచూపు'

రవి ప్యాకెట్ వూడదీశాడు. లేతనీలి రంగుచీరమీద వెండిమబ్బు పూలతో తళతళ లాడుతోంది చీర ఆ చీరను చూడగానే లతకళ్ళు మరీ పెద్దవయ్యాయి; 'చాల బావుందిబావా' అంది.

'ఆ! మరి కట్టుకురా' అన్నాడు సోఫాలో చేరగిలపడుతూ.

లత ఆచీర తీసికొని లోపలికివెళ్ళింది.

ముగింపు

లతరాకకోసం ఎదురుచూస్తూ కూర్చున్నాడు రవి

లేత నీలిరంగుచీరలో అందంగా నడచి వస్తున్న లతనుచూసి, 'రంభా! ఊర్వశా! మేనకా!...' అంటూ ఆమెకు ఎదురు వెళ్ళాడు.

'మరి నీవు బట్టలు మార్చవా'

'నే నెట్లావుంటే ఏం లతా! నా పక్కన నిన్నుచూసి ప్రతివాళ్ళూ నా అదృష్టానికి ఈర్ష్యపడతారు' అన్నాడు.

'పొరపాటు బావా! నిన్ను అందరికళ్ళ నుంచి ఎలా తప్పించనా అని ఇందాకటి నుంచి అనుకొంటున్నా తెలుసా' అంటూ బీరువాలోని బట్టలుతీసి అతనిముందు పడేసి త్వరగారా! బావా! మనం సినిమాకి వెళ్ళేది ఈరోజు' అన్నది అతన్ని తొందర చేస్తూ.

నీలం ట్వీడుసూట్‌మీద తెల్లని షర్టు టకప్‌చేసి లేత నీలిరంగు 'టై' కట్టుకొని పొడుగ్గా బలంగా ముఖంమీద జుట్టును అతి కష్టంగా వెనక్కి తోసుకొంటూ వస్తున్న రవినిచూసి.

'ఇంద్రుడో! జయంతుడో! కంతుడో!' అంటూ ఒకచేయి నడుంమీదా, ఒకచేయి బుగ్గమీదా ఆనించుకొని నిలబడ్డ లత చెవి పట్టుకొని.

'ఏంపిల్లా! మాటకుమాట బదులు చెప్తున్నావు జాగ్రత్త!' అన్నాడు

'వరే! ముందువదబాబూ' అంది చేయి తీసేస్తూ.

'అత్తయ్యా, ఓ అత్తయ్యా, రావమ్మా! టైం అయ్యింది' అని గట్టిగా కేక వేశాడు.

దొడ్లో పనిచేస్తున్న సుభద్రమ్మగారు రవికేకలకు హడావిడిగా 'ఏమిట్రా! ఏమయ్యింది' అంది కంగారుగా.

'తలుపువేసికో మేము వెళుతున్నాం' అన్నాడు నింపాదిగా.

'దీనికంత అరుపెందుకురా?' అని పక్కనిలబడ్డ లతనిచూస్తూ నిలబడింది.

ఆమె వుద్దేశ్యం గ్రహించనివాడిలా 'అత్తయ్య! ఇంక నీదే ఆలస్యం' అంటూ తల ఎగరేశాడు.

పక్కనవున్న లత సిగ్గుపడింది.

'అబ్బ! ఎన్నాళ్ళకు నీ నోరు మూత పడిందేతల్లి!' అన్నాడు లత మాట్లాడక పోవటంచూసి.

'పో! బావ!' అంది.

'అయితే నేను వెళుతున్నా! వస్తావా' అంటూ గబగబ మెట్లుదిగాడు.

'ఉండు! వుండు! అమ్మా తలుపు వేసికో' అని అత న్ననుసరించింది.

ఇద్దర్నీ కనుమాపుదాకా చూసి తలుపేసికొని వెళ్ళిపోయిం దావిడ.

కబుర్లు చెప్పుకుంటూ, ఏ చీకూచింతా లేనట్లు హాయిగా నవ్వుకుంటూ నడుస్తున్న ఆ జంటను అందరూ కళ్ళప్పగించి చూస్తున్నారు. బజారు వచ్చేసరికి చాల 'రష్'గా వుంది. అందులో ఆరోజు ఆదివారం. కార్ల మోతలు, సైకిలు బెల్లులు, అమ్మేవాళ్ళఅరుపులు, కంగారు కంగారుగా వుంది. పిల్లలుకూడ అంత ధైర్యంగా ఆ బజార్లో తిరుగుతూంటే, లతకు చెప్పలేని భయంవేసింది. అప్రయత్నంగా రవి చేయిపట్టుకొంది.

'ఏం లతా! భయంగావుందా!'

'అబ్బ! అసలు నువ్వు రోజూ ఎలా వెళుతున్నావో నాకు అర్థం కావటంలేదు. దీనికంటే హాయిగా ఇంట్లోవుంటేనే నయం' అంది.

'నువ్వు అప్పుడప్పుడు వస్తావు



కాబట్టే నీకలా వుంటుంది. కాని రోజూ తిరిగేవాళ్ళకు అసలు ఏమీ అనిపించదు.' అంటూ తన కెదురుగా వస్తూన్న లారీ కేసి చూశాడు.

ఇద్దరు చిన్నపిల్లలు 8, 10 ఏళ్ళుంటాయి. ఒకవేపునుండి రెండోవైపుకివస్తున్నారు. అసలు వాళ్ళకు చుట్టు ఏం జరుగుతుందో తెలియనట్లుంది. అందుకే అంత తాపీగా వస్తున్నారు. వెనకనుండి 'బస్ హారన్'తో వులిక్కిపడి,

'లత! నువ్వు అటు వెళ్ళు.' అంటూ ఒక్క పరుగున ఆమెచేయి విదిలించి ఆ పిల్లలవేపు పరిగెత్తాడు. లారీవాడు హారను మోగిస్తున్నాడు. ఇవతల బస్సులు. కారు మోత. ఒక్క పరుగున ఆ పిల్లవాడిని అవతలకిలాగి తాను ఇవతలకు రాబోయాడు. కాని అంతలోనే లారీచక్రాల కింద అతని కాళ్ళుండిపోయాయి. లత 'బావా'అంటూ రవిదగ్గరకి పరుగెత్తింది.

తెల్లని షర్టుఅంతా రక్తంతో తడిసిపోయింది. అతని కాళ్ళనిండా రక్తం ప్రవహిస్తోంది. అతనికి స్పృహలేదు. ఇందాకటి వరకు హుషారుగా కబుర్లు చెప్పుతున్న రవి, ఇప్పుడు ఏ చలనంలేకుండ పడివున్నాడు. ఒక్కసారి వెక్కివెక్కి ఏడ్చి అల్లాగే స్పృహతప్పి పడిపోయింది లత.

ఎవరో యిద్దర్ని హాస్పిటలుకు తీసికెళ్ళారు.

ఆ షాకునుంచి లత రెండురోజుల వరకు తేరుకోలేదు. కళ్ళు తెరచిన వెంటనే తన ఎదురుగావున్న తల్లినిచూసి 'అమ్మా! బావ' అని వెక్కి వెక్కి దిండులో తల దూర్చి ఏడ్చింది.

'లే! లత. బావకు ఏం ఫరవాలేదు. నిజంగా మనం చాల అదృష్టవంతులము. నువ్వు ఇలావుంటే అతను మరీ బాధపడ్తాడు' అంది ఆవిడ.

రవికి వెంటనే ఆక్సిజన్ అదియిచ్చి అతన్ని రక్షించగలిగారు డాక్టర్సు. కాని 'అతనికాలు తీసివేయాలి' అన్నారు

లతకు అవిషయం ఆ సమయంలో చెప్పలేదు.

పదిహేనురోజులు అతన్ని అక్కడవుంచి తరువాత యింటికితెచ్చారు. ఈ పదిహేను రోజులు నిద్రాహారాలుమాని లత అతనికి కావల్సినవి అందించింది. ఎప్పుడూ కళ

ముగింపు

కళలాడే ఆ యింట్లో నవ్వులే కరువయ్యాయి. రవి ఎప్పుడూ ఏదో ఆలోచిస్తూనే వుంటున్నాడు. లత అతనికి ఎన్ని చెప్పినా అతని ధోరణి మారలేదు. సుభద్రమ్మగారు పెద్దతనంలో ఇది తట్టుకోలేక పోయింది. అయినా వాళ్ళకోసం ఆవిడ లేచి తిరుగుతోంది. కాని ఆ ఓపికకూడ ఎన్నాళ్ళోవుండక ఆవిడను మంచం ఎక్కించింది. అన్ని బాధ్యతలు ఒక్కసారి లత మీద పడ్డాయి.

'బావా కాఫీ!' అంటూ రవి దగ్గరకి వచ్చింది లత.

పడుకునే ఆమెవంక తలెత్తి చూశాడు. చిక్కిపోయిపాలిపోయినవి ఆమె చెక్కిళ్ళు. అయినా ఆముఖంలోని చిలిపితనం రవికోసం అల్లాగే వున్నదనిపిస్తుంది.

'కాఫీ సరే! ముందు నువ్వుకూర్చో' అన్నాడు.

'ఏదేం కారం కాఫీ కాదులే!' అంది నవ్వుతూ.

'ఆసంగతి నాకు తెల్సు లతా! ఎందుకంటావా' నేను ఎట్లాగో పరుగెత్తలేనని నీకుతెలుసు అందుకే ఈ కుంటివాడిమీద నీకు చాలాజాలి' అన్నాడు.

అతను ఆమెవంక చూడటంలేదు. అతనిచూపు ఎక్కడోవుంది.

'బావా! ఎందుకిల్లా నన్ను క్షణం క్షణం చంపుతావు. నీకు కాలులేదని ఒక్కసారికూడ అనుకోలేదు. ఆ భావనే నాకు లేదు. మనం ఎలాపెరిగి పెద్దవాళ్ళమయ్యామో నాకు తెల్సు. అయినా ఇంకా నువ్వు నన్ను అర్థం చేసికోలేదు. అదే బాధగావుంది.' అంది.

'క్షమించు లతా! ఐయామ్ వెరీ సారీ! ప్లీజ్!'

'—కాసేపు కూర్చో నీతో మాట్లాడాలి' అన్నాడు.

లత మెదలకుండ కూర్చుంది. ఆమె చేతిలోని కప్పు తీసికొని మెల్లిగ లేచి కూర్చుని తాగేశాడు.

కొన్ని రోజులనుంచి ఆలోచించి చేసికొన్న తన నిర్ణయం ఆమెకు చెప్పాలి. కాని చెపుతామనుకుంటే ఎలా మొదలు పెట్టాలో తెలియటంలేదు. అతని మంచానికి ఎదురుగావున్న కిటికీలోంచి బయటకి చూశాడు.

వాతావరణం చాల చల్లగావుంది. వాన వస్తుందన్నట్లు మెల్లిమెల్లిగా నల్లటి మేఘాలు కమ్ముకుంటున్నాయి: ఇలావుంటే తనకు చాలయిష్టం. చిన్నప్పుడు తను, లత తోటంతా పరుగుపెట్టి ఆడేవాళ్ళు, పెద్దయినాసరే. సూర్యుడు మబ్బులలోకి పోయివున్నట్లుండి ఆకాశం చల్లబడినప్పుడు లత, తాను తోట్లో పచార్లు చేస్తూ కబుర్లు చెప్పుకునేవాటు పెద్ద వాన వచ్చేవరకు అత్తయ్య గోలపెట్టినా కదలివచ్చేవాళ్ళు కాదు.

కాని ఇప్పుడు తాను కుంటివాడు, అయినా ఇంక కదలకూడదన్నారు. ఇద్దరి మనస్సులో చెప్పలేనిబాధ. ఇద్దరికీ ఆసమయాన బయటకి వెళ్ళాలనివుంది. అలాగే చూస్తున్న రవినిచూసి 'బావా' అంది.

రవి తలతిప్పి ఆమెవంక చూశాడు. 'ఇప్పుడు నీతో ఒకటి చెప్తాను. మళ్ళా అపార్థం చేసికోకు'

'బయటకు వెళ్దామంటావా. ఎలా రాను నేను' అన్నాడు బాధగా.

'ఎందుకలా బాధపడ్తావు. ఇంకా నేను బతికేవున్నా నీకాళ్ళు పట్టుకొని ప్రార్థిస్తా. ఇలా ప్రతిదానికి నన్ను బాధపెట్టకు' అంది.

'లేదు లత. నువ్వన్నావనే నేనింత యిదిగాలేచి తిరుగుతున్నా. ఎందుకోనాకు తెలియకుండానే నానోటివెంట వస్తున్నాయి ఇలాంటిమాటలు. నేను ఏంచెయ్యను' అన్నాడు నుదుటిమీద చెయ్యి రుద్దుకుంటూ.

'లే బావ. తోటలోకి వెళ్దాము' అని తాను లేచి అతనికి తాను ఆసరాగా చేయి అందించింది.

తోటలోకి తీసికెళ్ళి అక్కడ సిమెంటు బెంచిమీద కూర్చోబెట్టి తాను కూర్చుంది.

తోటంతా పచ్చగా కళకళలాడుతోంది. కింద పచ్చటి తివాచీ పరచినట్లుంది గడ్డి మెత్తగా. ఎండాకాలం వెళ్ళి పదిహేను రోజులైంది వర్షాకాలానికి నాందిగా సూర్యుడు పక్కకు తప్పుకుంటున్నాడు. ఎండకు ఎండిపోయిన మొక్కలు కొద్ది వానకే ప్రాణం పోసి

కొన్నట్లు కొత్త చిగుళ్లు వస్తున్నాయి. ముద్దమందార పూలు చెట్లంతా విరగబూసి గాలికి వుయ్యాల లూగుతున్నాయి. లాటి వంకే తదేకంగా చూస్తున్నాడు రవి.

'బావా! ఏదో చెప్తాతా అన్నావు. అలాగే కూర్చుండి పోయావేమి?' అంది, అతి ప్రశాంతమైన ఆ ప్రదేశంలో అతి మృదువుగా ధ్వనించింది ఆమె కంఠం.

'చెప్తాతా! కాని ముందు నువ్వు మాట యివ్వాలి'

'నీ మాట ఎప్పుడు కాదన్నాను'

'అది నేను ఎప్పుడు మర్చిపోను లత. కాని నా తృప్తి కోసం ఒట్టు వెయ్యాలి' అన్నాడు బాధతో.

'ఒట్టు' అనంగానే అతని వంక చూసింది. ఆ కళ్లలో అదివరకటి వుత్సాహం లేశమైనాలేదు. ఏదో ధృడ సంకల్పం ఆ కళ్లలో కొట్టొ వచ్చినట్లు కనిపించి, లత ఒకసారి కలవర పడిపోయింది. అందుకే అతని చేతిలో చేయి వేయక అలాగే వుండిపోయింది.

'ఏం లతా. అప్పుడే నా మాట అంటే నీకు నమ్మకం పోయింది కదూ. అందుకే ఒట్టు వేయలేకపోతున్నావ్' అన్నాడు అసహనంగా.

'సరే బావ నీ మాట ఏది ఇంతవరకు కాదనలేదు. ఇప్పుడు మటుకు ఎందుకు కాదనాలి' అంటూ అతని చేతిలో చేయి వేసింది.

'లతా నేను నిన్ను పెళ్లి చేసికోను. విందుకంటే నేను నీకు తగను'

'బావా' అంటూ కోపంగా లేచింది.

'లత. దయచేసి కూర్చుని స్థిమితంగా నన్ను అర్థం చేసికో. చూడు లతా. ఈ కాలు విరిగిన వాడితో నీకు పెళ్లేమిటి? నా కంటె చక్కని వాడిని నీకు పెళ్లి చేస్తా.'

'బావా. ఇక ఆపు. ఇదా రాత్రింబవళ్లు నువ్వాలోచించేది. ఎంత పిచ్చివాడవు బావా నువ్వు. ప్రేమ హృదయాల్లో వుంటుంది కాని, రూపంలో కాదు. నీ ఒట్టుతో నన్ను కట్టి వేద్దామనుకున్నావు కాబోలు. నా పెళ్లి అన్నా మానుతా గాని, నీ కోర్కె నా కంఠంలో ప్రాణం వుండగా తీర్చలేను.' అంటూ విసురుగా లేచి రెండుమూడడుగులు వేసి వెళ్లబోయి రవి పిలుపుకి వెనక్కి తిరిగింది. ఆమె కళ్లను చూస్తుంటే అతనికి కొస్త భయం వేసింది.

'లత. నన్ను వదలి వెళ్లిపోతున్నావు. నేనెలా రాను' అన్నాడు బాధగా.

అతని మాటలు, అమాయకమైన ఆ ముఖం చూసి ఆమె మనస్సు చెప్పలేని బాధతో వూగిపోయింది. పెదాలను పళ్లతో బిగించి అతి ప్రయత్నం మీద తన్ను తాను నిగ్రహించుకొని రవి దగ్గరకు వచ్చి అతని నుదిటి మీద జుట్టును ప్రేమగా వెనక్కి తోసింది.

'లతా నువ్వు నా మీద ఒట్టువేశావు. గుర్తుంచుకో. నువ్వు నా మాట కాదంటె నేను' అన్నాడు మెడవాల్చి చేతులు చాపి.

ఆ మాటలకు ఆమె ఏమి జవాబు చెప్పక 'పద బావ. వాన వచ్చేట్లుంది' అని అతన్ని తీసికొని లోపలికి వెళ్లిపోయింది.

ఎంతోసేపు వుండబట్టలేని మేఘాలు వర్షాన్ని కురిపించాయి.

రవి బలవంతాన లత వివాహం శేఖర్‌తో అయింది. ఈ పెళ్లి ఎంత మాత్రం సుభద్రమ్మగారి కిష్టంలేదు రవికి ఎంతో చెప్పిచూసింది కాని అతని అభిప్రాయాన్ని ఆమె కొస్తకూడ మార్పలేకపోయింది. ఆవిడ కేవలం ఒక బొమ్మలాగా నిలబడింది.

* * *

సాయంకాలం నీరెండలో సన్నజాజి పందిరికింద మంచం వేసికొని కాళ్లు అటూ ఇటూ వూపుతూ చదువుతున్నది భారతి. సన్నని ఆమె వేళ్లమధ్యవున్న కాగితాలు గాలికి రెపరెప లాడుతున్నాయి. పొడుగాటి ఆమెజడ మంచంక్రిందకుజారి నేల ముద్దుపెట్టుకొంటున్నది. తలలోని జాజులు తమ పరిమళాలను వెదజల్లుతున్నాయి. ఆకథ పూర్తి అవటంతో చదవటం ఆపింది.

ఈకథ చదవమని బావ ఎందుకిచ్చాడో ఆమెకి పూర్తిగా అర్థమయ్యింది. ఎన్నడు అతను అన్నుకథలు చదమన్న పాపానపోలేదు. ఈ రోజు ఈకథనిచ్చి 'చదివి నీ అభిప్రాయం చెప్పమన్నాడు పైగా' అప్పుడే అనుకొంది ఇదేదో ప్రణయమను కొని. కాని ఇలాంటి అభిప్రాయం అతని కుంటుందని ఇది చదివాక తెలిసింది. ఇక ఇలాంటి ఆలోచనలు కలుగకుండ మంచి బుద్ధి చెప్పాలనుకొంది.

సాయంకాలం వెలుగు మెలమెల్లగ తరిగిపోయింది. పందిరికి దూరంగావున్న ఆ గులాబీల జంట గుసగుస లాడుతున్నాయి గాలికి పందిరిమీద కొయ్యకుండావున్న పూలు



మూలశంకకు
త్వరగా
నమ్మకమైన
హెడన్సాక్
చికిత్సను పొందండి
శస్త్రచికిత్స
అవసరములేదు!
DOL 327 TEL

తెల్లవెంట్రుకలుండవు
పొగడడం మాకు ఇష్టంలేదు. కాని మా "కేష్ రంజన్" ఆయుర్వేదిక్ సెంటెడ్ ఆయిల్ తెల్ల వెంట్రుకలను నల్లగా మార్చును. ఏ దట తెల్ల వెంట్రుకలు నల్లనిగామార్చి, ఆటుపైన నల్లని వెంట్రుకలే వచ్చును ఈ ఆయిల్ జ్ఞాపకశక్తి, కంటిచూపు వృద్ధిపరచును లాభంపొందినవారు 1000 పైగా మాకు వ్రాసియున్నారు. లాభం లేకున్న డబ్బు వాపసు. ధర రూ. 10/-
Western India Co., (S N)
P.O. Katri Sarai (Gaya)

1969–70 లో మీ అదృష్టము
మీరు ఒక పోస్టు కార్డుమీద యే పుష్పము పేరునైనా వ్రాసి, మీ అడ్రసు తెలుపండి. మేము మీకు రాబోవు పన్నెండునెలల్లో జరుగు ముఖ్య సంఘటనల

అనగా వ్యాపారంలో లాభనష్టాలు, నర్వీసులో ప్రమోషన్ & ట్రాన్స్ఫర్, పిల్లల జననం, వివాహం, సుఖ సంతోషాల మరియు చెడు నక్షత్రాలకు శాంతి చేసుకొను విధానములు రు. 1–25 లకే పంపెదము పోస్టేజిఅదనం ఒకదఫాచూచినతృప్తి చెందగలరు
PT. DEV DUTT SHASTRI
RAJ JYOTSHI MAP)
P.B 86, JULLUNDUR CITY

ముగింపు

ఆమెమీద రాలాయి. అవేమీ ఆమెకు ఆటంకం కలిగించలేదు. కదలాడుతున్న పాదాలు హఠాత్తుగా ఆగాయి. సన్నని పెదాలను పళ్ళతో నొక్కి, ఒక్క వుదుటున మంచం మించిలేచి లోపలికి పరిగెత్తింది. నల్లటి పొడుగాటి ఆమెజడ అందంగా వూయల లూగింది.

ప్రియమైన బావా!

నీ కథ చదివి నా అభిప్రాయం చెప్పమన్నావు. ఇక కథ గురించి అభిప్రాయం — ఈ కథ సహజంగా మూడు వంతులు నడచింది. (అది అంతా మనకథ లాంటిది కాబట్టి) ఒక ముగింపు ఎల్లావుందంటావు అచ్చు మన పిన్నిగారి లాగ. (ఆవిడని చూడంగానే నీ ముఖార విందం ఎల్లావుంటుందో నీకు తెల్సు అయినా మళ్ళా యిక్కడ రాస్తున్నా, ఆముదం తాగినట్లు) నీకథకు అందమైన ముగింపు నేను చెబుతా చూడు. దాన్ని నువ్వయినా సరే, ఎవరైనసరే 'కాపీ' కొడితే తగినచర్య తీసికొనబడును. తస్మాత్ జాగ్రత్త! నువ్వు నా బావవని వూరు కొంటా వనుకోకు

నీ కథ ఎక్కడ ఆపావో అక్కడ్నుంచి 'బిగిన్' చేస్తున్నా లత, శేఖర్ల వివాహంచేసి రవి తెరమరుగవుతాడు ఇక చదువు—

పాపం విధి వశమున ఒకానొక సందర్భమున శేఖర్ అంధుడయ్యె విధినెదిరించుట ఎవరితరము (ఇలాంటి బరువైన డైలాగులు నీ రచనలో మచ్చుకైన ఎక్కడ కానరావుకదా). తన చేతులతో అంటే 'ఓన్‌హాండ్స్'తో చేశాడు కదూ వారి వివాహం. అందువలన అదంతా తనవల్లనే కదా ఇట్లు జరిగెనని దురపిల్లెను. (అన్నం, నీళ్ళు, నిద్ర లేకపోవటం ఇదంతా మామూలే.)

రవి స్థితిచూసి లత ఒకనాడు ఇలా అంది—

'బావా నాకు ఇంతే ప్రాప్తం. నాకు ఏవంక లేనివాడ్ని చెయ్యాలనుకున్నావ్. కాని ఇప్పుడేమయింది ఆయనకు కళ్ళు పోయాయి. నా నుదుట భగవాన్ ఇలారాశాడు. నువ్వు చింతించక' అని ఓదార్చెను. రవి మళ్ళీ తెరమరుగయ్యెన్. శుభం.

'ఎల్లావుంది బావా నా ముగింపు'

ఒకచేయి చెంపకు ఆనించి పడుకొని భారతి రాసినకథ చదువుతున్న నేను అటు తిరిగా.

గుమ్మానికి ఒకచేయి ఆన్చి వెడ అల్లవోకగా ఒకభుజంమీద వాల్చి నిలబడింది—భారతి.

సంధ్యాకాలమై సూర్యుడు మెల్లగ క్రిందకు దిగుతున్నాడు — సన్నటి చీకటి తెరలు మెల్లగ గదుల్లోకి జొరపడుతున్నాయి. అందుకే ఆమె ముఖం నా కంటి స్పష్టంగా కనబడలేదు కాని ఆ కళ్ళలోని మెరుపు చీకట్లో కూడ తళతళ లాడుతోంది. అందుకే ఆ కళ్ళంటే నా కిష్టం,

ఆమె రాసిన కథ అప్పుడే పూర్తి చేసిన నేను 'నీ ముఖంలా వుంది' లన్నా. నా చెంపమీద నా చేయి తీస్తూ. ఇందాకటి నుంచి అల్లా పడుకొన్నానేమో ఆ చేయి నొప్పి పుట్టింది.

'అయితే ఇంకేం చాల బావుందన్న మాట' అంటూ లోపలికి వచ్చి గోడకున్న లైటు స్విచ్ వేసింది.

అంతవరకూ వున్న చీకటి ఒక్కసారి పారిపోయింది. వెలుగు ఒక్కసారి వచ్చే సరికి నా కళ్ళు రెపరెపలాడి సర్దుకొన్నాయి, లైటు వెలుగులో ఆమె సౌందర్యం మరింత ప్రకాశిస్తోంది. రాళ్ళ జూకాల వెలుగు మన్నటి ఆమె చెక్కిళ్ళమీద పడి అటుఇటు పరుగులిడుతోంది.

'నన్ను తిరిగ్గా చూద్దువుగాని, ముందు నేనడిగిన దానికి జవాబు చెప్పు' అంటూ అక్కడ వున్న స్టూల్ నా దగ్గరగా లాక్కొని కూర్చుంది.

భారతి అడిగిన ప్రశ్న గుర్తు వచ్చింది.

'నువ్వు అడిగింది నీ కథ ముగింపు ఎలా వుందని కదూ, చెప్పనా. చెత్త!' అన్నా ముక్కు మూసుకొంటూ.

'నా కథ చదివి గొప్పగా ముక్కు మూసుకొన్నావుగాని, నీ కథ చదివిన వెంటనే ఆత్మహత్య చేసికొందామనుకొన్నా' అంది కోపంగా. ఆమె కళ్ళు నా మీద యుద్ధం ప్రకటిస్తున్నట్లున్నాయి.

'అలాగా! నా కథలు ఆత్మహత్య కన్నా వుపయోగపడుతున్నందుకు సంతోషించు. జీవితం మీద విరక్తి కల్గినవాళ్ళు

మండ్రలి షాపుకు వెళ్ళారు. ఎక్కడకు వెళ్ళతారో తెలుసా. బుక్ స్టాలుకి! వెళ్ళి ఫలానాఆయన పుస్తకం ఒకటివ్వండి' అంటారు నాపేరు దశదిశలా వ్యాపిస్తుంది. నా పుస్తకంవిలువ వెయ్యిలో వుంటుంది. ఆ తరువాత ... అంటూ మంచంమీద లేచి కూర్చున్నా.

'ఎరక్కపోయి అన్నా ఈ పురాణం ఆపు బావా!' అంది.

'లేకపోతే నాతో ఆటలనుకొన్నావా!' అన్నా కాలరెత్తి.

'అసలు సంగతి చెప్పక ఈ పైత్యమేమిటి? ముందు నా కథ ముగింపు ఎలావుంది' అంది రెండుచేతులూ గడ్డం కింద చేర్చి కుతూహలంగా. 'అలా ఎన్నటికి జరుగదు. అన్నా ఖచ్చితంగా'

'ఏం? ఎందుకు జరుగదు? నువ్వు రాసినట్లు జరుగగా లేంది నేను రాసినట్లు ఎందుకు జరుగదు?' ఆమెచేతులు బిగుసుకొన్నాయి.

'నాది నిజంకాబట్టి' అని వెంటనే నాలిక కరుచుకొన్నా. కాని ఏంచేయను. నోరు జారేశాను.

'నాది అంతకన్నా పచ్చినిజం'

ఎవరి మనసుల్లో వాళ్ళకి ఈ నిజం తెలుస్తూనే వుంది.

ఇంతవరకు ఎవరు బయటపెట్టడమూ అన్న సందిగ్ధమే మమ్మల్ని వేధిస్తోంది.

'డియర్ భారతీ అలా ఎన్నటికి జరగదు.'

'మై డియర్ త్యాగరాజు' అంది లేచి నించుంటూ.

గదంతా చూశా. నాకు ఆ త్యాగరాజు ఎవరు కనబడలేదు. నా అవస్థచూసి పకపక నవ్వింది. గదిలోని లైటు ఒకసారి వెలవెల బోయింది.

'త్యాగరాజు ఇంకెవ్వరు. నువ్వు. ఇకనుంచి నీపేరు త్యాగరాజని పిలువబడును త్యాగాలకు రాజువి నువ్వు, ఆరాజుని పొందిన నేనెంత ధన్యురాలను అంది. తన సన్ననివేళ్ళతో జడ అల్లుకుంటూ. ఆమెకళ్ళు అల్లరిగా నవ్వుతున్నాయి. వాటిని చూడంగానే నాకు చాలకోపం వచ్చింది.

'నేనేం త్యాగాలుచెయ్యాలా' నాకంఠం నాకే గట్టిగా వినిపించింది,

'పిచ్చిబావా! నీకేం తెలియదు అందుకే నువ్వంటే నాకు చాలయిష్టం' అంటూ ఆమె తన చేతులలో నాముఖం పైకెత్తింది మృదువైన ఆమెచేతుల్లో అల్లాగే వుండాలనిపించింది

'నాముఖంచూసి నిజంచెప్పు నువ్వు రాసినది మనకథే కదూ!' అంది మృదువుగా. ఎర్రని ఆమె పెదాలు మృదువుగా నవ్వుతున్నాయి. ఆమె మాటలకు మంత్రముగ్ధుడ్నయి 'అవునని' తలూపా. నా ముఖంమీదనుంచి ఆమెచేతులు తీసి ఇందాక తను కూర్చున్న కుర్చీలో కూర్చుంది. ఆమెపాదాలు నేలను అటుఇటు రాస్తున్నాయి. ఆమెచీర కుచ్చిళ్ళుకూడ వాటికి లయగా తాళం వేస్తున్నాయి,

ఆమె పాదాలవంక అలాగే చూస్తూ కూర్చున్నా.

నీ కథంతా మనగురించే అని నాకు తెల్సు. సంభాషణలు అన్ని మనం రోజు అనుకునేవే 'కేవలం పేర్లుమార్చావు నీ కథ చదివాక నీ అభిప్రాయం నాకర్థమయింది. ఈ నీ అభిప్రాయం మటుకు నీదికాదు. సినిమాలు, పుస్తకాల అభిప్రాయాలు. కాని అవి చూడడానికి చదవడానికి బావుంటాయి. కాని అవే మన జీవితాల్లో చేద్దామను కొంటున్నావు. అది అసాధ్యం. అలా ఎన్నటికి జరుగదు.

'ఏం? ఎందుకు జరుగదు?'

'నీ గురించి నాకు పూర్తిగా తెల్సు కాబట్టి' అంది వెంటనే. 'నీ కాలికి దెబ్బ తగలకపోతే ఈపాటికి మనిదరకి వివాహం అయ్యేది. నీకు కుంటి అయినంతమాత్రాన నీ మీద నా ప్రేమ తరుగుతుందను కున్నావు. ఇంకొటి ఏమిటో చెప్పనా. ఇంతచెట్టంత మనిషినేవుండగా నాతో నీ అభిప్రాయం చక్కగా చెప్పవచ్చుగదా. అదంతా ఒకకథరాసి నా ప్రాణాలు తీశావు. ఇదంతా కథలోలాగ జరుగుతుం దనుకున్నావు. నువ్వు రాసిన కథలోలాగానే మన నిజజీవితంలో జరగాలనుకున్నావు నీ కథలో రవిలాగ నువ్వుండగలవా అని అనుమానం, ఒకవేళ నువ్వు ఆపని చేయికల్గినా నేను లతలాగ ఎప్పటికీ కాను.! అని బరువుగా వూపిరి తీసిందామె.

ఆమె కంఠములోని స్థిరసంకల్పము కొట్టవచ్చినట్లు కనబడింది. భారతి అన్నది నిజమే ఆమెను వదిలి ఒక్కడే తాను ఇంతవరకు వుండలేదు. ఈ కాలు కుంటితో ఆమెను నాపక్క చూడాలంటే నామనస్సు అంగీకరించటంలేదు. ఆమె హృదయాల్లో నా స్థానము చాల బలమైనదని తెలుసు నాకాలుకి ఆ ప్రమాదం



జరుగకపోతే ఈపాటికి మేము తాజ్ మహల్ దగ్గర ప్రపంచంలోని ఆనందం అంతా మాదేనని తిరిగేవాళ్లము. ఆమెకు చెప్పే ధైర్యము లేక తన నవ్వులతో నా అభిప్రాయం త్రోసివేస్తుందని కథలాగ రాసి యిచ్చా.

రెండు చేతులలో నా ముఖం తుడుచుకొన్నా కిటికీలోంచి సన్నని వెన్నెలకాంతి లోపలికి వచ్చి లైటుకాంతిలో కలిసిపోతోంది. నా కాలివంక ఒకసారి చూసుకొన్నా. తొందర్లోనే ఆ కాలు బాగవుతుందన్నారు. నాకాలు విరిగినాకూడ ఆమె మాటలలో నాకు అసలు కాలువిరిగిందన్న ఆలోచనే నాకు దూరం అయింది. ఎప్పటికి నేను సరిగ్గా నడవగలనో. నా దృష్టిలో భారతి నేను ఒకళ్లచేతులు ఒకళ్లు పట్టుకొని వేగంగా నడచిపోతున్న దృశ్యం అందంగా కనబడుతోంది. 'నిజమేనేమో' అనుకొన్నా కాని నాకాలుకి డాక్టరు కట్టినకట్లు అల్లాగేవుంది.

'భారతీ! ఈ కాలుతో నిన్ను చేసికోవడం నాకు యిష్టంలేదు.' నా కట్టుమీద దృష్టి వుంచి అన్నా.

'అల్లాగే నువ్వు చేసికోవద్దు నాయినా. నువ్వునాకు కట్టబెట్టే ఆ మహానుభావుడికి ఏకాలో ఏచేయో విరిగితే' ఆమెముఖం నాకు కనిపించకుండ అటు త్రిప్పేసుకుంది అంటూ.

'భారతి అల్లా జరుగుతుందని ముందే ఎందుకనుకొంటావు?'

'నువ్వు జరగదని రాసివ్వు అలాగే చేసికొంటా'

కిటికీలోంచి చల్లని గాలి తెరలు తెరలుగ వస్తోంది. నా కాలికింద వున్న దుప్పటి పైకి లాక్కున్నా భారతి లేచి కిటికి రెక్కలు కాస్త దగ్గరగ వేసి వచ్చింది.

'చిన్నప్పట్నించి ఒక్కటిగా పెరిగాము. మనం ఎన్ని తిట్లు తిట్లు తిట్టుకున్నా, ఆ తిట్ల వెనుక తియ్యటి అనుభవము, ఆప్యాయత ఎన్నటికి చెరగదు. ఇంకా నువ్వు అదే అభిప్రాయంతో వున్నావా?' అంది. నాకు దగ్గరగా వస్తూ.

'చెప్పు బావా! ఏమిటి ఆలోచిస్తున్నావు?' అంది తిరిగి. ఆమె నల్లని కాటుక కళ్లలోని ఆప్యాయత అంచులు

దాటి ప్రవహిస్తోంది.

'ఈ కథను ఎలా ముగించనా' అని అన్నాను. ఆ కళ్లను చూస్తూ. 'చెప్పనా' అంది నా పక్కనే కూర్చుంటూ. నా ప్రక్క మీద పడి వున్న ఆమె వుత్తరం చించేసింది. ఉండు ఇప్పుడే వస్తా అని లోపలికి వెళ్లింది.

ఆమె చేసేదేమిటో నా కర్థం కాలేదు. ఎందుకు ఆలోచించటం. ఆమె వస్తుందిగా అనుకొని అమె రాక కోసం ఎదురు చూస్తూ మంచం మీంచి లేచి కుంటుతూ మెల్లిగా అక్కడ. సోఫాలో జారగిలపడ్డా.

ఆమె వస్తూనే ఆమె చేతిలోని నా కథ కాగితాలు చూశా. ఆమె కథ కాగితాలు నాకు యిచ్చి చివరి రెండు పేజీలు తీసి చించేసింది.

'ఏయ్! అది కథ. ఎందుకలా చించేస్తావు. ఎంతో కష్టపడి రాసినది'

ఆ కాగితాలు ఆమె చేతిలో ముక్కలు ముక్కలవుతూంటే చూడలేక పోయాను

'నిజమైన కథ రాసినప్పుడు ఆ కథ ముగింపుకూడా అంత నిజమై వుండాలి. కనుక ఇప్పుడు ఈ కథకు ముగింపురాయి' అంటూ టేబిల్‌మీదవున్న కాగితం పెన్ను యిస్తూ అంది.

గదిలోని ఆ చిన్నముక్కలు రెప రెపలాడుతూ తలో మూలకి ప్రయాణం చేశాయి.

'నువ్వు రాయరాదూ' అన్నా.

'నువ్వు నన్ను రాయమన్నావు కాబట్టి, నేను బాగా రాస్తాననే అర్థం. కాని రాసే ఓపికలేదు. కాని ఒక్కటి చెప్తుతా విను.

నువ్వు ఎప్పుడు కథలోలాగా జీవించాలని ప్రయత్నించకు. రాసినంత అందంగా నువ్వు చెయ్యాలనుకోడం నిర్భమే అవుతుంది. నువ్వు త్యాగరాజుకాక నారాజుగా వుండు' అంది నవ్వుతూ.

నేను ఏమి మాటాడక ఆమెయిచ్చిన కాగితంమీద రాస్తున్నా. భారతి సోఫా వెనకకువచ్చి వంగి నే రాసేది చూడపోయింది. ఆమెకు చదవాలన్న ఆత్రుతమ నా చేతితో అడ్డుపెట్టి నవ్వుతూ.

'ఏయ్! అమ్మాయ్! బుద్ధిగా అల్లా కూర్చో. అప్పుడేయిస్తా' అన్నా.

'ఎంతసేపు బాబూ' అంటూ విసుగ్గా లేచి కిటికీదగ్గరకువెళ్లి నుంచొని కిటికీ రెక్కలుతీసి బయటకుచూస్తూ నుంచొంది.

'ఇదిగో! నేరాసిన కాగితం.' అని ఆమెను పిలచి ఇచ్చా.

'లతా, (నిన్నే) ఇంకెప్పుడు యిలాంటి పిచ్చి 'ఐడియాస్'తో నిన్ను బాధపెట్టను. ప్రేమమూర్తి అయిన నువ్వు నాదానివన్న గర్వమే నా నరనరాల్లో కల్గుతోంది.' అంటూ రవి 'లతా!' అని చేతులుచాపాడు.

'రవీ!' అంటూ లతదగ్గరగా వచ్చింది. అంటూ చదివి తిరగబోయింది కాని ఆమె వెనక నన్నుచూసి 'అబ్బా ఎంత ఆశ' అంటు బయటకు పరిగెత్తబోయింది.

'ఏయ్ ఆండాళమ్మా! ఆగు ఒక్కమాట విను' భారతి నామాటవిని వెనక్కు తిరిగింది ఆ తిరగడంలో నల్లని పొడుగాటి ఆజడ మెడచుట్టు తిరిగింది.

'నాపేరు అదేంకాదు. అయినా వెల రోజులకి మళ్లీ తిరిగి నీ నోట ఈపేరు వింటుంటే నీకు ఎదురు చెప్పాలనిపించటల్లేదు' అంది. ఆ కళ్లు ఆనందంతో తళుక్కుమన్నాయి.

'నాకథకి ముగింపు ఎలావుందో చెప్పకుండ వెళ్లితేఎలా' అక్కడే నుంచోని 'ఇంక వేరేచెప్పాలా' అంటు నన్ను వెక్కిరించి వెళ్లిపోయింది.

'ఆమె వెళ్లిపోయినా సన్నజాజుల పరిమళం అక్కడే వుండిపోయింది రాత్రింబగళ్లు నన్ను తినేసిన పాడు ఆలోచనలన్నీ దూది పింజలాగా ఎగిరిపోయాయి. ఈ కుంటికాలితో భారతిని చేసుకోడం అన్యాయం అవుతుందేమో అలా అని ఆమెను వదులుకోలేడు. కథ అయితే రాసేసా. ఇది పత్రికలోచదివి పాఠకులు మెచ్చుకొనేవారు తనని. నిజజీవితంలో అంత తేలిగ్గా భారతిని తాను ఎవరికన్న తన చేతులతో సమర్పించేవాడా...లేదు...ఆపని చెయ్యలేడు. ఇలాంటి రచనలతో పాఠకులను మోసం చేస్తున్నానా అనిపించింది. అయినా ఇప్పుడు నామనస్సు వాటి గురించి ఆలోచించే స్థితిలోలేదు. నాకథకు అందమైన ముగింపు దొరికింది అంతే చాలు ●